క్లుప్తంగా

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



అమర్తలూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం వెంటనే చెల్లించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. అమర్తలూరు మండలంలోని తురిమెళ్ల, పెదపూడి గ్రామాలకు గ్రామ పార్టీ కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. తురిమెళ్ల గ్రామ పార్టీ అధ్యక్షుడిగా మన్నవ విల్సన్, పెదపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కాకర్లమూడి భాగ్యరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలయినా రైతులకు పెట్టుబడి సాయం అందించడం మర్చి పోయిందన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తియి, రబీ పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల తడిసిన, రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. వైఎస్సార్‌సీపీ రైతుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్యాపర్రు సర్పంచ్ గడ్డిపాటి శ్రీనివాసరరావు, కళా గిరిబాబు, గాలి రామకృష్ణ, దేవరపల్లి సురేష్, టి.రామకృష్ణ, గేరా సంగీతరావు, పి.నాగేశ్వరరావు, పెదపూడి ఎంపీటీసీ తెనాలి పవన్, ఉప సర్పంచ్ సుధాకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



రేపల్లె రూరల్: పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ చెప్పారు. దోమల నివారణకు ఏర్పాటు చేసిన ఫాగింగ్ వాహనం, మిషన్‌ను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మలేరియా, డెంగీ, చికిన్ గున్యా తదితర వ్యాధులకు కారణమైన దోమలను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఫాగింగ్ నిర్వహణకు అత్యాధునిక యంత్రాలను కొనుగోలు చేసి నిత్యం పట్టణంలో సంచరించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు సైతం తమ పరిసరాలలో దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరం వీఆర్వో గుండెపోటుతో మృతి



బాలకోటేశ్వరరావు మృతదేహం

నగరం: నగరం వీఆర్వోగా పనిచేస్తున్న మోపిదేవి బాలకోటేశ్వరరావు (43) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. విధులకు హాజరయ్యేందుకు రేపల్లె నుంచి నగరం వస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాలకోటేశ్వరరావు మృతి పట్ల నగరం తహసీల్దార్ నాంచారయ్య, రెవెన్యూ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. బాలకోటేశ్వరరావు ఏపీసీపీఎస్‌ఈఏ అధ్యక్షుడిగా పనిచేశారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన మృతి ఏపీసీపీఎస్‌ఈఏకు తీరని లోటని జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ అన్నారు. బాలకోటేశ్వరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



రేపల్లె రూరల్: ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎంఈవో రత్నశేఖర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నవీన్, సూర్యలు మాట్లాడుతూ రేపల్లె పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో కూడా పూర్తిగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు. ర్యాంకుల కోసం అదనంగా తరగతులు నిర్వహిస్తూ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రభుత్వ కార్యాలయం.. అపరిశుభ్రతకు నిలయం

- కార్యాలయాల చుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు
- ప్రాంగణాలలోనే చెత్త చెదారం నిల్వలు
- విషపురుగులు, సర్పాల సంచారంతో బెంబేలెత్తుతున్న ప్రజలు



సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల సమీపంలో పెరిగిన పిచ్చిమొక్కలు

రేపల్లె రూరల్: ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రతకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ పదే పదే ఊకదంపుడు ప్రచారాలు నిర్వహించే అధికారులు తమ కార్యాలయాల ఆవరణలను గాలికొదిలేస్తున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు చెత్త చెదారంతో పాటు పిచ్చిమొక్కలతో నిండి దర్శనమిస్తున్నాయి.

ఒకచోటే 21 కార్యలయాలు

రేపల్లె పట్టణంలోని తాలూకా గ్రౌండ్‌లో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 21 ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండటం విశేషం. దీంతో మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి పనులపై నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు కార్యాలయాలకు వస్తూ పోతుంటారు. రేపల్లె డివిజన్ కేంద్రంగా ఉండటంతో డివిజన్‌లోని 7 మండలాల ప్రజలు రేపల్లెకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే తాలూకా ప్రాంగణంలో ఉన్న పలు కార్యాలయాలు అపరిశుభ్రతకు నిలయాలుగా ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, సాంఘిక సంక్షేమ శాఖ, రెవెన్యూ గెస్ట్‌హౌస్, ఐసీడీఎస్ కార్యాలయాల చుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగుల సంచారానికి వీలుగా ఉన్నాయి. దీంతో పాటు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో చెత్త నిల్వలు పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంది. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలు అపరిశుభ్రమైన వాతావరణం చూసి అసౌకర్యానికి గురవుతున్నారు. కార్యాలయాలకు వచ్చిన సమయాలలో కొంత సేపు సేద తీరేందుకు అక్కడే ఉన్న బల్లలపై కుర్చున్న ప్రజలకు విష పురుగులు, సర్పాలు దర్శనమిస్తుండటంతో భయాందోళనలకు గురవుతున్నారు. రెవెన్యూ గెస్ట్‌హౌస్ సమీపంలో పాము కాటుకు గురై ఓ ఆవు మరణించిన ఘటన అందరికి విదితమే. పరిసరాల పరిశుభ్రతపై నిత్యం ప్రసంగాలు చేసే అధికారులకు పరిశుభ్రత వర్తించదా..? అంటూ ప్రజలతో పాటు ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాల ఆవరణలో పిచ్చిమొక్కలు



తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త నిల్వలు



అపరిశుభ్రంగా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ పరిసరాలు



సీడీపీవో కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు

ప్రతి రైతుకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది



అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి బాపట్ల తరలివెళుతున్న డాక్టర్ ఈవూరి గణేష్, పార్టీ శ్రేణులు

డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో రైతన్నలు పూర్తిగా కుదేలైపోయారని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో శుక్రవారం జరుగుతున్న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు రేపల్లె నియోజకవర్గం నుంచి పెద్ద సఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలి వెళుతున్నట్లు గణేష్ చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన సేవలందించారని గుర్తు చేశారు. జగనన్న గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని తూచా తప్పకుండా ఐదు సంవత్సరాలు సంవత్సరానికి రూ.13,500 రైతులు ఖాతాల్లోనే జమచేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి సంవత్సరం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో అబద్ధపు హామీ ఇచ్చి ఖరీఫ్ సీజన్ ముగిసినా కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చెయ్యాలని లేని పక్షంలో ప్రజలే కూటమి నాయకులకు బుద్ధి చెబుతారని డాక్టర్ గణేష్ అన్నారు. అనంతరం గుళ్ళపల్లి క్యాంపు కార్యలయం నుంచి ద్విచక్ర వాహనాలు ట్రాక్టర్లు, కార్లలో పెద్ద సంఖ్యలో బాపట్ల తరలివెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాదులు గుజ్జర్లమూడి ప్రశాంత్, బొర్రా శ్రీనివాసరావు, కాటూరి శివ, ఇంకొల్లు రామకృష్ణ, ఉప్పాల వెంకటేశ్వరరావు, దుండి వెంకటరామిరెడ్డి, ఏమినేని సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపట్ల రైతుల ధర్నాకు వెళ్లిన వరికూటి అశోక్‌బాబు

వేమూరు: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు ధర్నా నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని శుక్రవారం బాపట్ల కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు నియోజకవర్గంలో రైతులతో కలిసి వెళ్లడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల నుంచి రైతులు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా కదలి రావడం జరిగిందని ఆయన తెలిపారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. మూడు రోజులు క్రితం ప్యాపర్రు గ్రామంలో ధాన్యం పరిశీలించడం జరిగిందని, ప్యాపర్రులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 180 క్వింటాళ్లు కొనుగోలు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున మాట్లాడుతూ వర్షాల వల్ల కొంత ధాన్యం తడిసి రంగు మారిందని, రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


విలేకరులపై దాడులు హేయమైన చర్య

బాపట్ల జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు




రేపల్లెలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న పత్రికా విలేకరులు

బాపట్లటౌన్: విలేకరులపై దాడులు హేయమైన చర్యని బాపట్ల జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు. పులివెందుల నియోజకవర్గం వేముల మండల కేంద్రంలో న్యూస్ కవరేజ్ చేస్తున్న సాక్షి రిపోర్టర్‌పై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం దారుణమన్నారు. సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు, ప్రభుత్వాలకు తెలియజేసే వ్యక్తులే మీడియా మిత్రులని, అటువంటి మీడియా మిత్రులపై దాడులు చేయడం క్షమించరాని నేరమన్నారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో టీవీ-9 విలేకరిపై ప్రముఖ సినీ నటుడు దాడి చేశారని, ఇలాంటి ఘటనలు మంచి పద్ధతి కాదన్నారు. పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా మీడియా మిత్రులు పని చేస్తారని ఎవరు మెప్పు కోసమో పని చేయరనే విషయాన్ని రాజకీయ నాయకులు, పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. మీడియా మిత్రులు కేవలం వారు పని చేసే సంస్థ కోసం వార్తల సేకరణ చేస్తారనే విషయాన్ని గమనించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మీడియా మిత్రులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా మిత్రుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. తెలంగాణలో టీవీ 9, ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి ప్రతినిధులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. బాపట్ల జిల్లా ప్రెస్‌క్లబ్ సభ్యులు బండ్రెడ్డి గోపి, చల్లా శ్రీనివాసరావు, బుర్ల ఆంజనేయులు, జోగి సువర్ణరాజు, విన్నకోట శ్రీను పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాపట్ల జిల్లా ప్రెస్‌క్లబ్ సభ్యులు



కొల్లూరు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ రిపోర్టర్లు

విస్తృతంగా విద్యుత్ తనిఖీలు



మాట్లాడుతున్న ఎస్ఈ ఆంజనేయులు, విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, విద్యుత్ విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు చెప్పారు. శుక్రవారం ఉదయం ఎస్ఈ ఆంజనేయులు, విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పలు మండలాలకు చెందిన విద్యుత్ ఏఈలు, సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి మండల పరిధిలో 3,650 సర్వీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యుత్ అధికారులు మాట్లాడుతూ మండలంలో 398 సర్వీసులకు సంబంధించి అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి సుమారు రూ.15 లక్షల జరిమానా విధించామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పొదుపుగా విద్యుత్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి ఏడీ విజయ్‌శ్రీనివాస్, పిట్టలవానిపాలెం ఏఈ చంద్రశేఖర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జంపనిలో హనుమద్ వ్రతం



జంపని(వేమూరు): జంపని గ్రామంలో వేంచేసి ఉన్న రామంజనీయ స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం హనుమద్ వ్రత వార్షిక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో ఉదయం సుప్రభాత సేవ అనంతరం దీవి లక్ష్మీనరసింహాచార్యులు విశ్వక్సేన ఆరాధన, అజస్ర దీపారాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. వార్షిక పూజాకర్తలు కంచర్ల ఉమాదేవి, తలసిల గంగాధర్‌రావు, తలసిల ఈశ్వరరావు దంపతులు స్వామి వారికి 27 పవిత్ర ద్రవ్యాలతో అభిషేకం జరిపించారు. సాయంత్రం చక్రధారి కుటుంబీకులు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. స్వామి వారికి సహస్ర నామ పూజ అనంతరం శ్రీనివాస మూర్తి హనుమద్ వ్రత కథా ప్రవచనం చేశారు. గుంటూరు వెంకట్రావు, ఎనగందల హరి ప్రసాద్ దంపతులు ప్రసాద వితరణ చేశారు. వీరాంజనేయస్వామి భక్తి సమాజం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు ఆలపించారు. పండిత మామిళ్లపల్లి షణ్ముఖ శర్మ వేద పారాయణ గావించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బాపట్లటౌన్: బాపట్ల 132 కేవీ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బాపట్ల పట్టణం, మండలం, కర్లపాలెం మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ టి. శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

కొల్లూరు : విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం మండలంలోని సుగ్గనలంక సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లనుందని విద్యుత్ శాఖ ఏఈ కె.సుధాకర్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సుగ్గనలంక సబ్‌స్టేషన్ పరిధిలోని చిలుమూరులంక, సుగ్గనలంక, అన్నవరపులంక, కనిగిరిలంక, కొత్తూరులంక గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపల్లె రూరల్: ఇసుకపల్లిలోని 132/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణ, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వేమూరు: విద్యుత్ మరమ్మతుల కోసం వ్యవసాయ విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ 33-11 కేవీ పరిధిలోని 11 కేవీ జంపని ఫీడర్ పరిధిలోని జంపని, చంపాడు, పోతుమర్రు, గ్రామాల్లో శనివారం విద్యుత్ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపి వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

గ్రామాల్లో క్రిస్మస్ కోలాహలం



భట్టిప్రోలు: క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని గ్రామాలలో క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేస్తున్నారు. క్రిస్మస్‌కు నెల రోజుల ముందు నుంచే క్రైస్తవ ప్రార్థనా మందిరాలపై క్రిస్మస్ స్టార్లు కొలువై విద్యుత్ కాంతులు విరజిల్లుతున్నాయి. ఈ నెల 25న క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు.

పరిశుభ్రమైన నీటిని తాగాలి



కర్లపాలెం: అందరూ పరిశుభ్రమైన నీటినే తాగాలని బాపట్ల ఈటీసీ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డి.వెంకటరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న గ్రామాల సుస్థిరాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ముగింపు రోజు శుక్రవారం ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషితమైన నీటిని తాగటం వలన అనేక వ్యాధులు వస్తాయని చెప్పారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలలో అందుబాటులో ఉన్న నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వాటిని పూర్తి చేయాలని చెప్పారు. అధికారులందరూ అంకిత భావంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యే విధంగా కృషి చెయ్యాలని చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి రేచల్ దివ్య, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం



పెదపులివర్రు జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తదితరులు

భట్టిప్రోలు: నీటి సంఘాల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో పెదపులివర్రు, సూరేపల్లి, భట్టిప్రోలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఈ ఎన్నికలు ఆయా గ్రామాల్లోని హైస్కూళ్లలో నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు చెప్పారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆయా ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో సంఘానికి సంబంధించి 12 టీసీలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టీసీ ఎన్నికకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా నీటి తీరువా, భూమి శిస్తు బకాయిలు లేకుండా ఉండాలని అలాగే ఓటు హక్కు కలిగిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ వీటిలో ఏదో ఒకటి చూపి ఎన్నికకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారి, సహాయ అధికారి, పీవో, ఏపీవోలు అందుబాటులో ఉండి ఎన్నికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరిగే భట్టిప్రోలు టీఎంరావు, పెదపులివర్రు జెడ్పీ హైస్కూల్స్‌ను తహసీల్దార్ సందర్శించారు. ఆయన వెంట ఆర్ఐ ఫణికుమార్, హెచ్ఎం ఎండీ సుభాని, చందలూరి రామకోటేశ్వరరావు, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలు

కొల్లూరు : నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయినట్లు నీటిపారుదల శాఖ ఏఈ సాంబశివరావు పేర్కొన్నారు. కొల్లూరు నీటిపారుదల శాఖ సెక్షన్ పరిధిలోని అనంతవరం, కుశ్చళ్లపాడు, ఈపూరు, రావికంపాడు, దోనేపూడి, కొల్లూరు, పెదపులివర్రు నీటి సంఘాలకు నిర్వహించనున్న ఎన్నికల్లో ఒక్కో సంఘంలో 12 మంది టీసీలకు ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు టీసీల ఎన్నికలు జరగనున్నయన్నారు. అనంతవరం నీటి సంఘానికి అనంతవరం జెడ్పీహైస్కూల్, కుశ్చళ్లపాడు సంఘానికి వేమూరు జెడ్పీహైస్కూల్, ఈపూరు సంఘానికి చిలుమూరు శ్రీరామ రూరల్ విద్యా సంస్థలు, రావికంపాడు సంఘానికి కొల్లూరు బాలికోన్నత పాఠశాల, దోనేపూడి సంఘానికి దోనేపూడి జెడ్పీహైస్కూల్, కొల్లూరు సంఘానికి కొల్లూరు బాలురోన్నత పాఠశాల, పెదపులివర్రు సంఘానికి పెదపులివర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. టీసీల ఎన్నికల అనంతరం మధ్యాహ్నం నుంచి డబ్ల్యూఏ అధ్యక్షుడి ఎన్నిక జరగనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలి

బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం లింక్ ఆఫీసర్ జి.కెజియా



మాట్లాడుతున్న బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం లింక్ ఆఫీసర్ కెజియా

భట్టిప్రోలు: గ్రామాభివృద్ధికి వివిధ అంశాలపై అవగాహన పెంచుకుని సరైన ప్రణాళికలను రూపొందించుకోవాలని బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం లింక్ ఆఫీసర్ జి.కెజియా అన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశం (ఐసీడీజీ) పై మొదటి బ్యాచ్‌కు సంబంధించి గ్రామ పంచాయతీ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెటర్నరీ, డిజిటల్, హార్టీకల్చర్ అసిస్టెంట్లకు జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా కెజియా మాట్లాడుతూ ప్రణాళికల తయారీ, సర్వేలలో ప్రతి ఒక్కరూ పాల్గొని సమన్వయంతో పని చేయాలని కోరారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో వివిధ అంశాలపై మాస్టర్ ట్రైనర్లు ఎ.చిన వెంకటేష్‌బాబు, వక్కలగడ్డ సురేష్, మండల సమాఖ్య ఏపీఎం జి.శ్రీమన్నారాయణలు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, ఎంపీడీవో ఎస్.వెంకట రమణ ఈవోపీఆర్డీ టి.ఊహారాణి పాల్గొన్నారు.

కోడిపుంజు విషయంలో వాగ్వాదం.. దాడి

భట్టిప్రోలు: కోడిపుంజు విషయంలో ఇరువురు వాగ్వాదానికి దిగి దాడి చేసుకున్న వైనమిది. భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య కథనం ప్రకారం గురువారం మండలంలోని పెదలంక మధ్యగూడెంకు చెందిన కొల్లూరు నవీన్ తన కోళ్లను అదే గ్రామానికి చెందిన నన్నెపాముల దివ్య కుమార్ తీసుకువెళ్లాడని తెలిసి అడిగితే అసభ్య పదజాలంతో తిట్టడమే కాక దాడి చేసినట్లు తెలిపారు. దాడికి గురైన ఫిర్యాదుదారుడు నవీన్ రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు.